వెళ్ళొస్తా గురూ పద్మాకర్ మోటర్ సైకిల్ స్టార్ట్ చేశాడు.

విహారి కారు దగ్గరికి వచ్చి డ్రైవింగ్ డోర్ తెరిచాడు.

పక్క సీట్‌లో ప్రవల్లిక వుంది.

ఇద్దరూ ఒక రేంజిలోకి రాగానే A5 డ్రైవర్‌కి సైగ చేశాడు. కారు నెమ్మదిగా బయల్దేరింది. విహారి వంగి లోపల కూర్చోబోతున్నాడు.

మిషన్ గన్ పేలడం ప్రారంభించింది ముందు బంక్ తాలూకు అద్దాలు ఫెళ ఫెళ విరిగిపోయాయి. ఒక సరళరేఖ గీచినట్టు గుళ్ళు గుర్తులు పడుతున్నాయి అయితే అదే సమయానికి బంక్ కుర్రవాడు చిల్లర ఇవ్వడానికి డోర్ దగ్గరగా వచ్చాడు. అతడి శరీరం క్షణాల్లో జల్లెడలా అయింది రక్తం జివ్వున చిమ్మింది. మరో రెండుగుళ్లు పెట్రోలు ట్యూబ్‌కి తగిలాయి మెయిన్ కంట్రోల్ ఆఫ్ చెయ్యకపోవడంతో పెట్రోల్ ఫౌంటేన్‌లా బయటకు రాసాగింది చుట్టూ వున్న జనానికి ఏం జరిగిందో తెలిసే లోపులో ఈ దారుణం జరిగిపోయింది.

మొదట చప్పుడు వినబడగానే ప్రవల్లిక ఆ విషయాన్ని గ్రహించి కారు స్టార్ట్ చేసింది. ఇటువంటి ఆకస్మిక చర్యలకు వెంటనే రియాక్ట్ అవడం  సి.బి.ఐ. ట్రైనింగ్ చెబుతారు.

విహారి కారు తలుపు బలంగా వేశాడు.

ఈలోపులో A5 కారు వేగం పుంజుకుంది జీవితంలో మొట్ట మొదటిసారి యిలా జరగడంతో ఆ టెర్రరిస్టు రామ్‌లాల్‌కి ఏం సమధానం చెప్పాలా అన్న భయంతో వున్నాడు.

ఇక్కడ పెట్రోల్ బంక్ దగ్గర పద్మాకర్ కూడా అకస్మాత్తుగా పేలిన మిషన్‌గన్ చప్పుళ్ళకి స్థాణువయ్యాడు. ఒక గుండు చెవి పక్కగా దూసుకుపోయింది. మరొకటి ఎయిర్ ఫిల్లర్‌కి తగిలింది అతడు మోటార్ సైకిల్ వదిలేశాడు.

ఇంత గొడవ జరుగుతున్నా ట్రాఫిక్ వేగంగా వెళ్తూనే వుంది. బంక్ యజమాని బంక్ దగ్గరున్న మోటరిస్టులు మాత్రం భయంతో అరుస్తున్నారు. సిగరెట్ వెలిగిస్తున్న హిప్పీమీద పడింది పద్మాకర్ దృష్టి.

ట్యూబునుంచి ధారగా కుడి రోడ్డువైపు మడుగు కడుతూంది పెట్రోలు అటువేపే వస్తున్నారు పిల్లలు దసరా పండుగ ఉత్సాహంతో పాటలు పాడుకుంటూ.

పద్మాకర్ పరుగెత్తడం ప్రారంభించాడు. పడిపోయిన మోటర్ సైకిల్ మధ్యలో వున్న బంక్ కుర్రాడి శవాన్ని చూసుకోలేదు. ఒక స్లో మోషన్ పిక్చర్‌లోలా అతడు హిప్పీని చేరుకోవడం అతడి చేతిలోంచి నేలమీదకు జారుతున్న అగ్గిపుల్లను మధ్యలో పట్టుకోవడం ఒకేసారి జరిగిపోయాయి.

ఈ లోపులో జనానికి జరిగింది అంతా తెలిసింది. అందరూ దూరంగా పరుగెత్తారు. అంతా హడావుడిగా తయారయింది. పద్మాకర్ అదే వూపులో వెళ్ళి ఫిల్లర్ ఆపుచేశాడు. పెట్రోలు ప్రవాహం ఆగిపోయింది. ఎవరో ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేసారు.

గాల్లోకి ఆవిరి అవుతోంది. దురం నుంచి ఏమాత్రం చిన్న అగ్ని తగిలినా మొత్తం పేలిపోతుంది. అయినా జనం దూరం నుంచి చూస్తూనే వున్నారు. యజమానికి పిచ్చెక్కినట్టుంది. ఇదేమీ పట్టనట్టు యుద్ధభూమిలో సైనికుడిలా పరిగెత్తుకుంటూ పద్మాకర్ ఫిల్లర్ నుంచి వాటర్ టాంకర్ దగ్గరకు వెళ్ళాడు. లారీలకు నింపుకునే నీళ్ళున్నాయి దాని అడుగు గొట్టం విప్పాడు అప్పటికి స్పృహలోకి వచ్చినట్టు ఇద్దరు ముగ్గురు సాయంచేసారు. ఎలాగైతేనేం నీళ్ళు ప్రవహించడం మొదలు పెట్టి పెట్రోల్ కలిసి దూరంగా వెళ్లసాగాయి. పెట్రోలు నీళ్ళలో కలిసినా మండే స్వభావాన్ని కోల్పోదు కానీ బంక్ నుంచి దూరంగా వెళ్తోంది జనం కూడా ఆటోమటిక్‌గా దూరంగా వెళ్ళారు. అదీ కావల్సింది.

అయిదు నిమిషాల్లో అక్కడ స్థితి యధావిధి అయింది.

ఒకవేపు నుంచి పోలీసు వ్యాను మరొకవైపు నుంచి ఫైరింజను వచ్చాయి శవం దగ్గరకు పోలీసులు పరుగెత్తారు.

యజమాని నుంచి తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ పద్మాకర్ దగ్గరకొచ్చాడు కాల్పులు ఎవరి మీద ఎవరు జరిపారో మీకేమైన అనుమానంగా వుందా?

లేదే అన్నాడు పద్మాకర్ నేను గాలి కొట్టించుకుందామని వచ్చాను.

సరే మీరు వెళ్ళొచ్చు బైదిబై కంగ్రాచ్యులేషన్స్ గొప్ప ప్రమాదం నుంచి ఈ ప్రదేశాన్ని కాపాడారు.

థాంక్స్ అని పద్మాకర్ మోటార్ సైకిల్ వేపు నడిచాడు.

పెద్ద ప్రమాదం తనకోసం పొంచి వున్నదని అతడికి తెలీదు.

*                    *                    *

విహారి ప్రవల్లిక ఉన్నది టయోటా దుండగులది అంబాసిడారు. జనసమర్థం ఎక్కువ వున్న ప్రాంతాల్లో టాయోటా వేగంగా నడపడం కష్టమైన ప్రవల్లిక చేతిలో అది బాణంలా దూసుకుపోతోంది. నిజానికి అది కారు కాల్పుల సమయంలో స్టీరింగ్‌వేపు జరిగి స్టార్టు చేయడం వల్లనే ఇద్దరూ రక్షింపబడ్డారు.

ముందు కారులో వాళ్ళకి వెనుక అనుసరిస్తూ వస్తూన్న కారు సంగతి తెలిసింది. దాని వేగం హెచ్చింది. దాన్ని డ్రైవరు యిటువంటి పరిస్థితుల్లో కారు తప్పించడానికే ట్రైనింగ్ పొందినవాడు.

ప్రభుత్వం యిచ్చిన ట్రైనింగ్‌కి టెర్రరిస్టుల ట్రైనింగ్‌కీ మధ్య పోటీ .....

రెండు కార్లూ వూరి చివరికి చేరుకుని నేషనల్ హేవే మీదకు ఎక్కాయి..... ముందు కారులోంచి మిషన్‌గన్ బయటకొచ్చింది. వరుసగా చప్పుళ్ళు ప్రవల్లిక ముందు అద్దం బ్రద్ధలయింది ఇద్దరూ తలలు వంచి బుల్లెట్స్ బారినుంచి తప్పించుకున్నారు.

రెండుకార్లూ తూనీగల్లా వెళుతున్నాయి.

అవతలివాళ్లు. అలా అయితే ఎవరికీ అనుమానం రాదని వాళ్ళ ఆలోచన అది ఒక్కటే మామూలు ట్రాఫిక్ యీ మారణహోమం గురించి తెలీదు. ఇంతలో ముందు కారు ఓ పక్కదారి పట్టింది అది నిర్మానుష్యంగా ఉంది

పిస్టల్ వుందా అడిగాడు విహారి.

డ్రైవ్‌చేస్తూనే ప్రవల్లిక తీసి ఇచ్చింది. అతడు ఎదురు కాల్పులు సాగించాడు. రెండు గుళ్ళు బోనెట్‌కి తగిలాయి మూడు గాలిలోకి దూసుకువెళ్ళాయి అరవదీ ఆఖరుదీ అయిన బుల్లెట్ మాత్రం సరిగ్గా వెళ్ళి వెనుక టైర్‌లో గుచ్చుకుంది.

వేగంగా వెళుతున్న కారు వెనుక టైర్ పేలిపోయే సరికి ఆ వత్తిడికి తట్టుకోలేక పక్కకి తిరిగింది. అదే వేగంతో వెళ్ళి హైవేమీద వున్న చెట్టుకు గుద్దుకుంది.

స్టీరింగ్‌కీ సీటుకీ మధ్య ఇరుక్కుని డ్రైవర్ పెట్టిన ఆర్తనాదం ఆ ప్రాంతమంతా ప్రతి ధ్వనించింది A5 వెనుక సీటులోంచి దిగాడు. విహారి కారు సమీపించేలోపు పొలాల్లోకి అడ్డంగా పరుగెత్తాడు.

విహారి వెనుకే వేగంగా అతడిని ఫాలో అయ్యాడు.

ఫర్లాంగు దాటాక చిన్న సెలయేరు వుంది రజకులు ఉతికిన బట్టలు వరుసగా ఆరేసి వున్నాయి. అక్కడ స్తంభాలకు తాళ్ళుకట్టి వ్రేలాడదీశారు. వాటిమధ్య A5 అదృశ్యమయ్యాడు.

వరుసగా ఉన్నాయి చీరెలు ..... పాంట్లు .....

విహారి తల క్రిందకి వంచి అవతలి వ్యక్తి చూడడానికి పయత్నించాడు. జవాబుగా పిస్టోలు పేలింది విహారి తల పక్కకున్న చీరెకి కన్నం పడింది. అన్ని బట్టల మధ్య అవతలి వ్యక్తి కనబడడం లేదు. పిస్తోలులో గుళ్ళు లేవు.

విహారి ఒక రాయిని తీసుకుని దూరంగా ఒక పాంటుని కొట్టాడు పాంటు కదలికకి అదిరిపడి A5 అటు పేల్చాడు ఇటుపక్క చొక్కా కదిలింది ఇటు పేల్చబోయాడు గానీ అతడి పిస్టోల్లో గుళ్ళు కూడా అయిపోయాయి. సరిగ్గా ఆ సందర్భం కోసమే ఎదురుచూస్తున్నాడు విహారి వెనుక నుంచి పిస్టోలు మడమతో ఒకే ఒక దెబ్బ కొట్టాడు.

A5 కుప్పకూలిపోయాడు.

అదే సమయానికి ప్రవల్లిక అక్కడికి చేరుకుంది. ఇద్దరూ కలిసి అతడికి స్పృహ తెప్పించడం కోసం ఒకరు యేటినుంచి నీళ్ళు తెచ్చి మొహం మీద జల్లారు. మరొకరు ఈ లోపులో చేతులు వెనక్కి కట్టేశాడు. అయిదు నిమిషాల్లో అతడికి స్పృహ వచ్చింది. లేపి తమ కారు వద్దకు తీసుకొచ్చారు A5 దెబ్బ తిన్న పులిలా వున్నాడు.

ఇతన్నేం చేస్తారు? అడిగాడు ప్రవల్లికను.

ఆమె అర్థంకానట్టు పెట్రోల్ బంక్ దగ్గర హత్య చేశాడు. మన మీద హత్యాప్రయత్నం చేశాడు. ఆ నేరాల మీద పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తాము. అంతకన్నా ఏం చేస్తాం? అంది.

తీసుకువెళ్ళి పోలీసు కస్టడీలో వుంచావు వాడే మళ్ళీ నీ కారు డోర్ తెరిచాడు గుర్తుందా?

అవును ఆ డిపార్ట్‌మెంట్‌లో ఏవరో అనంతానంతస్వామికి సాయపడ్డారు.

ఇసారి మళ్ళీ సాయపడరని నమ్మకం ఏమిటి?

అందుకని ఏం చేద్దాం?

మన కస్టడీలో వుంచుకుందాం.

ఆమె నిశ్చేష్టురాలై ఏమిటి? అంది.

అవును వీడిని చూస్తుంటే సీనియర్ సహచరుడిలా వున్నాడు. స్వామి తాలుకు ఎన్నో రహస్యాలు వీడికి తెలిసి వుంటాయి వాటిలో ఏ ఒక్క ముఖ్యమైనది రాబట్టినా స్వామి అంతు చూడొచ్చు.

నా ప్రాణం పోయిన ఒక్క రహస్యం చెప్పను అన్నాడు పట్టుబడిన టెర్రరిస్టు.

ప్రవల్లిక విహారిని దూరంగా తీసుకెళ్ళింది పోలీసులకి తెలియకుండా వీడిని మనదగ్గర వుంచుకోవడం నేరం అంది.

అందుకే మీ డిపార్టుమెంట్స్‌లో ఏ పనీ సరిగ్గా అవదు. అన్నీ రూల్స్ ప్రకారం జరగాలంటారు సరే..... వీడు నీకు దొరకలేదనుకుని ఇక ఈ విషయం మర్చిపో నేను చూసుకుంటాను.

ఆమె వప్పుకుంటున్నట్టు సరే మన దగ్గిర వుంచుకుంటాము. కానీ వీళ్ళు చాలా మంచి ట్రెయినింగ్ పొందిన టెర్రరిస్టులు మా ఇన్‌స్పెక్టర్స్ సుశిక్షితమైన థర్డ్ డిగ్రీ మెథడ్స్ ఉపయోగిస్తే ఏమీ చెప్పరు. నీకెలా చెప్తారు వాళ్ళ రహస్యాలు?

నేను ఫోర్త్ డిగ్రీ మెథడ్స్ ఉపయోగిస్తాను పద అంటూ తిరిగి కారు వద్దకు తీసుకొచ్చాడు. అక్కడ కట్టివేయబడివున్న ఉగ్రవాదివైపు చూసి నవ్వేడు.

సూర్యారావు సెంట్రల్ మినిష్టర్ అయ్యాక స్వామికి ఏ విధంగా సాయపడుతున్నాడు? అని అడిగాడు.

నాకు తెలీదు.

ఇంకొక్కసారి అడుగుతాను. సుర్యారావు సెంట్రల్ మినిష్టర్ అయ్యాక స్వామికి ఏ విధంగా సాయపడుతున్నాడు?

నాకు తెలీదు.

ఆ సమాధానానికి వాడి మొహంమీద కొడతాడేమో అనుకుంది ప్రవల్లిక. విహారి అలా చేయలేదు. పక్కనే వున్న కారు దగ్గరకి వెళ్ళి పరీక్షించాడు. స్టీరింగ్ దగ్గర రెండో టెర్రరిస్టు చచ్చిపోయి వున్నాడు. వాడి శరీరాన్ని లాగి బయటపడేశాడు. ప్రవల్లిక విస్తుబోయి చూస్తుంది ఆక్సిండెంట్‌లో అలా జోక్యం కలుగజేసుకోవడం నేరం అతడేం చేస్తున్నాడో అర్థంకాలేదు. ఈ లోపులో విహారి కారు లోపలకి ఎక్కి స్టార్టుచేసి చూశాడు. కొంచెం ట్రబుల్ ఇచ్చినా తొందరగానే స్టార్టు అయింది.

విహారి తన పనిలో ఉండటం ప్రవల్లిక అటే చూస్తూ ఉండడం చూసి A5 పరుగెట్టి వెళ్ళిపోవడానికి ప్రయత్నించాడు. కానీ చేతులు వెనక్కి కట్టివేయబడి వుండడంతో నిమిషంలోనే తిరిగి లొంగిపోయాడు.

విహారి వాడిని తీసుకొచ్చి కారు డిక్కీలో పడేశాడు డిక్కీ మూసేసి స్టీరింగ్ దగ్గర కూర్చున్నాడు. లోపల్నుంచి వాడు నో ..... నో అని అరుస్తున్నాడు. కారు స్టార్ట్ చేసి రివర్స్‌లో వేగంగా తీసుకెళ్ళి చెట్టుకి కొట్టాడు దబ్‌మన్న శబ్దం .....

లోపల్నుంచి కెవ్వున కేక వినిపించింది.

కారు కాస్త ముందుకు తీసుకెళ్ళి మళ్ళీ రివర్స్‌లో కొట్టాడు వెనుక చొట్ట పడింది లోపల మూట కదిలినట్టు చప్పుడు అరుపులకి వాటిని పట్టించుకునే నాథుడే లేడు.

ప్రవల్లిక దూరంగా నిలబడి ప్రేక్షకురాలిగా చూస్తోంది. ఏ గూఢచారి సంస్థ రహస్యాలు చెప్పించడానికి ఇటువంటి విధానం అవలంబించి వుండదు ఆమె మరో ప్రపంచంలో వున్నట్టు చూస్తోంది.

విహారి ప్రత్యర్థి మనస్తత్వం మీదే ఇక్కడ ట్రిక్ ప్లే చేశాడు. ప్రశ్నలడిగి బాధపెట్టడం లేదు. చెప్తావా? చెప్పవా? అని రెట్టించడం లేదు కాడు డిక్కీలో పడేశాడు. అక్కడ చీకటిగా వుంది ఊపిరాడడం లేదు. కారు కదలిక విషయం తెలుస్తోంది. ఎప్పుడు కొట్టుకుంటుందో తెలియడం లేదు. చెయ్యే విరగొచ్చు మెడే విరగొచ్చు చచ్చిపోతే ఆక్సిడెంట్‌లో చచ్చినట్టు కార్లో వదిలేసి వెళ్లిపోతారు.

ఏం చెయ్యాలి?

A5 ఆలోచించుకునే లోపులో కారు మళ్ళీ వెళ్ళి చెట్టుకి కొట్టుకుంది బాధతో తిరిగిపోయాడు.

కారు మళ్ళీ స్టార్టయింది

చెప్తాను ..... చె ..... ప్తా ..... ను అని అరిచాడు లోపల్నుంచి.

విహారి కారు ఆపుచేసి దిగి వెనక డిక్కీ తెరిచాడు. బట్టల మూటలా లోపల టెర్రరిస్టు పడి వున్నాడు.

వాడిని అలానే వెనుక సీటులో తెచ్చి కూలేశాడు. ప్రవల్లిక పక్కన కూర్చుంది. విహారి కారు స్టార్టు చేసి నగరం వైపు పోనివ్వసాగాడు.

ప్రవల్లికకి ఆశ్చర్యంగా వుంది. టెర్రరిస్టు అంత సులభంగా బ్రేక్ అవుతాడనుకోలేదు. బహుశా కళ్ళముందే తన అనుచరుడు మరణించడం నిన్ను చంపడానికయినా వెనుదీయను అన్నట్టు విహారి ప్రవర్తన కారు డిక్కీలో చీకటి అన్నీ కలిసి అతడిని బ్రేక్ చేసి వుంటాయి అదే సి.బి.ఐలో అయితే ఎన్నో ట్రీట్‌మెంట్‌లు చేయవలసి వచ్చేది.

వీడిని మనం మన దగ్గరే వుంచుకుందాం అన్నాడు విహారి మీ డిపార్టుమెంట్‌కి అప్పగిస్తే

మూసెయ్యడానికి ప్రయత్నించవచ్చు కూడా.

అది నేరం కానీ ప్రవల్లిక దానికి వప్పుకుంది ఆమె ఇప్పుడిప్పుడే విహారి పంథాలో ఆలోచించడం నేర్చుకుంటోంది.

ఊ చెప్పు సూర్యారావు తరువాత ప్రణాళిక ఏమిటి?

వెనుక సీట్‌లో వాడు మాట్లాడలేదు. కాస్త ధైర్యం వచ్చినట్టుంది. విహారి కూడ మాట్లాడకుండా కారు మళ్ళీ వెనక్కి త్రిప్పాడు మళ్ళీ ఎక్కడికి? అని అడిగింది ప్రవల్లిక.

ఆక్సిడెంట్ జరిగిన చోటుకే వీడు మాట్లాడడం లేదు కదా. మళ్ళీ కారు డిక్కీలో ..... అతడి మాటలు పూర్తికాకుండానే

చెప్తాను వెనుకనుంచి వాడు అన్నాడు. ఈ సారి డిక్కీలో పడేస్తే మరణం తథ్యం.

చెప్పు మరి? కారు తిరిగి స్టార్టు చేస్తూ అడిగాడు.

జపాన్ నుంచి ఇండియాకి రాబోయే ఆట బొమ్మల షిప్‌లో .....

ఊ షిప్‌లో ..... ?

సరిగ్గా అదేసమయంలో ఓ అనుకోని సంఘటన హఠాత్తుగా జరిగింది.

ఆ టెర్రరిస్టు అసలే భయంలో వున్నాడు. చెప్పకపోతే ఇప్పుడు చెప్తే ఎప్పటికైనా వాళ్ళచేతిలో మరణం. డొలాయమాన స్థితిలో ఆఖరియత్నం చేశాడు. కారు వెనక్కి తిప్పడంలో కాస్త నెమ్మదైంది చేతులు కట్టివున్నా హేండిల్ తీసుకోవడం వాడికి కష్టం కాలేదు ఒక్క ఉదుటున కారు దిగి గమ్యం లేకుండా పరుగెత్తాడు.

ఆ హడావుడిలో వెనుకనుంచి వస్తున్న లారీని చూసుకోలేదు.

అదే వేగంతో వచ్చి లారీ వాడిని కొట్టుకుంది. అడ్డు పెట్టుకోవడానికి కూడ వీల్లేకుండా చేతులు కట్టేసి వున్నాయి. వాడి శరీరం గాలిలో ఎగిరి అంత దూరాన పడింది.

అంతా క్షణాల్లో జరిగింది.

విహారి ప్రవల్లికలు చలనం లేని ప్రేక్షకులే అయ్యారు.

రోడ్డు కవతల ప్రక్కన రక్తపు ముద్దల్లా పడివున్నాడు టెర్రరిస్టు ప్రాణం పోలేదు కానీ తల పచ్చడైంది.

*     *     *          *

అనంతానంతస్వామి ఉగ్రుడయ్యాడు. జరిగింది జరిగినట్టు అతడికి తెలిసిపోయింది. ఒకడు చచ్చిపోయాడు రెండోవాడు చావు బ్రతుకుల మధ్య వాళ్ల చేతుల్లో చిక్కుకున్నాడు. వాడు అప్రూవర్‌గా మారితే కష్టం వాడికి చాలా రహస్యాలు తెలుసు. బ్రతుకుతాడా? అని అడిగాడు స్వామి. చాలా మేజర్ ఆపరేషన్ స్వామీ డాక్టర్ దయానంద కృష్ణ మూర్తి చేస్తున్నాడు. అతనే సూపర్ స్పెషలిస్టు ..... ఈ నగరంలో కెల్లా గొప్ప న్యూరో సర్జన్ అతడి మాటలు ఇంకా పూర్తికాలేదు వాటిని మధ్యలో ఆపు చేస్తూ A5 నోరువిప్పకూడదు క్లుప్తంగా అన్నాడు స్వామి పరమేశ్వరం ఫోను మూసి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.